# ఆఖరి న్యాయం

"న్యాయదేవతని కల్సుకుని మాట్లాడాలి లోపలికి పోనియ్ "అన్నాడు అతగాడు. "వీల్లేదు అన్నాడు ద్వారపాలకుడు. ద్వారపాలకుని ముఖం ఎర్రగా, కఠినంగా వున్నప్పటికి, మాట మాత్రం సౌమ్యంగానే వుంది. " ఎందుకువీల్లేదు?" అనడిగేడు వచ్చిన వ్యక్తి కాస్త చిన్న బుచ్చుకుంటూ.

తన చిన్న వయస్సు, మనోహరాకారం, మధుర వాక్కులతో ఎవర్నైనా లోబరుచుకుని, ఎక్కడికేనా వెళ్లి, ఏదేనా సాధించుకు రాగలనన్న ధీమాతో వచ్చి న అతగాడికి కాస్త గట్టి దెబ్బే తగిలింది ద్వార పాలకుడి సమాధానంతో పౌరుషం తెచ్చుకుంటూ "ఎందుకు వీల్లేదో చెప్పు" అని రెట్టించి మరీ అడిగేడు. నింపాదిగా వచ్చింది సమాధానం ద్వార పాలకుడి నుంచి.

" ఎందుకనా? ఎందుకనంటే ఏమిటి చెప్పమంటావ్? మాట వరసకి పోనీ నువ్వు యింతగా అడుగుతున్నావు కదా అని నిన్ను లోపలికి పంపించానే అనుకో అయినా నువ్వు న్యాయదేవత సమక్షానికి చేరుకోలేవే!"

"అదే ఎందుకు చేరుకోలేను అని?"

" ఎందుకనంటే, లోపల నువ్వు దాటి వెళ్లవలసిన ద్వారాలు యింకా చాలా వున్నాయి. ప్రతీ ద్వారం దగ్గర ఒక ద్వార పాలకుడుంటాడు. వాళ్లంతా ఒకర్ని మించి మరొకరు క్రూరంగానూ, కఠినంగాను వ్యవహరిస్తారు. ఎంతటి మహానుభావుడేనా వాళ్లని కాదని లోపలికి వెళ్లలేడు అందర్లోకీ నేనే కాస్తమంచివాడ్ని, సౌమ్యుడ్నీ అనుకో. నేను కనుక నీతోయింతసేపు మాట్లాడుతున్నాను. కానీ లోపలి వాళ్లయితే, నిన్ను కనీసం ద్వారం ఛాయలక్కూడా రానివ్వరు, నీవైపు కన్నెత్తైనా చూడరు, తెలిసిందా!"

"నువ్వు చెప్తున్నదంతా బాగానేవుంది గాని- ఒక్కసారి నన్ను లోపలికి పంపించి చూడు - అంతమంది ద్వారపాలకుల్ని ఎలా వశపర్చుకుని ఎలా న్యాయదేవత కొలువులోకి వెళతానో నీకే తెలుస్తుంది. "

"నువ్వీరకంగా మాట్లాడతావని ముందే ఊహించాను. నీ అందం, చురుకుతనం, నీ మాటకారితనం నేను గ్రహించలేదనుకోకు, వాటితో ఎవ్వరినైనా ప్రలోభపెట్టి, నీవైపు త్రిప్పుకోవచ్చునని భ్రమపడుతున్నట్టున్నావు - కాని ఇక్కడ అలాంటి ఆటలేం సాగవు, న్యాయదేవత కొలువులో పని చేస్తున్న వాళ్లంతా ప్రలోభాలకి పూర్తిగా అతీతులు. ప్రలోభాల్ని

జయించిన వాళ్లే ఇక్కడ వుద్యోగస్తులుగా నియమించబడతారు". ఉస్సూరని నిట్టూర్చేడు వచ్చిన వ్యక్తి. ఏవైతే తన ప్రత్యేక శక్తులని నమ్ముతూ వచ్చాడో అవి ఇక్కడ పూర్తిగా నిరుపయోగం అని తెలియగానే దిక్కుతోచని నిస్పృహ ఆవరించేసిందతగాడ్ని. నిరాశపడిపోతునే చివరి ప్రయత్నంగా " అయితే నన్నేంచెయ్యమంటావిప్పుడు" అనడిగేడు. "నిరాశపడకు - కూర్చోయిక్కడ" అని దగ్గర్లోనే వున్న ఒక అరుగును చూపించేడు. అరుగు రంగు రంగుల చలవ రాళ్లతో నిర్మించబడింది. అరుగుమీదకి ఎండ పడకుండా దట్టంగా పచ్చగా వ్యాపించిన చెట్టు కొమ్మలు, లేత ఆకుపచ్చరంగులో వున్న ఆకులు కదులుతూవుంటే - మనస్సుకీ, శరీరానికీ కూడా ఊరట కలిగించే గాలి సుతారంగా తగులుతోంది. చెట్లకొమ్మల్లో ఎవరికీ కనపడకుండా గూళ్లు ఏర్పర్చుకున్న పక్షులు వుండివుండి మహామధురంగా కూస్తున్నాయి. ఆ అరుగు మీద కాసేపు విశ్రమిస్తే " ఈ స్వర్గసుఖం చాలు, ఇంకేమి నాకక్కర్లేదు" అనే భావం కలిగి తీరుతుంది ఎవ్వరికేనా. కాని న్యాయదేవతను చూడాలని వచ్చిన ఆ వ్యక్తికి మాత్రం ఎందుకనో అలాంటి భావం కలుగలేదు. తనచుట్టూవున్న స్వర్గంలాంటి దృశ్యంమీద అతనికి దృష్టిలేదు. అతని ధ్యాసల్లా కాపలాదారు ఎప్పుడు తనని లోపలికి వెళ్లనిస్తాడోఅనే . ద్వార పాలకుడు కూడా అతని ఆతృతను గమనించినట్టున్నాడు. "లోపలికి కబురు చేసానయ్యా, నువ్వు న్యాయదేవత దర్శనానికి వేచివున్నావని! రమ్మని పిలుపు రాగానే నిన్ను లోపలికి పంపుతాను. అందాకా విశ్రాంతిగా కూర్చో."

కాని విశ్రాంతి తీసుకోదల్చుకోలేదు ఆ వ్యక్తి. గంట గంటకి లేచివెళ్లి " కబురొచ్చిందా" అనడుగుతున్నాడు. ఇతని మాటల్లో ఎంత ఆతృత కనబడుతుందో ద్వార పాలకుడు జవాబుల్లో అంత నింపాది కనబడుతోంది. "వొస్తుంది, వొస్తుంది అంత తొందరపడిపోతే ఎలా?" అని బుజ్జగించినట్టుచెప్పి, చిరునవ్వు నవ్వుతున్నాడు.

గంటలుదాటి రోజుల్లో పడింది వేచివుండటం. ఓ పది రోజులు గడిచాక కాబోలు " ఏవయ్యా - ఎన్నాళ్లు నేనిలా పడిగాపులు పడివుండాలి? అసలు దర్శనం దొరుకుతుందో దొరకదో తేల్చిచెప్పేస్తేనాదోవని నేను పోతాను" అన్నాడావ్యక్తి యిక ఆలస్యాన్ని ఎంత మాత్రం భరించలేనన్న ధోరణిలో. అయితే ద్వార పాలకుడు మాత్రం బహునింపాదిగా " పోవటానికయ్యావచ్చింది? న్యాయదేవతని చూడాలని వచ్చేవు కనుక చూసిన తర్వాతనే ఇక్కడనుండి కదిలేది అనే పట్టుదల వుండాలిగాని" అని మెత్తగా మందలించాడు. తరువాత వ్యక్తి ఎక్కడ చిన్నబుచ్చుకుంటాడో అన్నట్టుగా బుజ్జగింపు ధోరణిలో " ఇప్పుడు నీకిక్కడ ఏంతక్కువైందని అంత ముళ్ల మీద కూర్చున్నవాడిలా కంగారు పడిపోతున్నావు? ఎంత హాయిగా వుంటుంది ఈ అరుగు మీద కూర్చుంటే! లోపలికి పంపు, లోపలికి పంపు అని తొందర పడిపోతున్నావు గాని, తీరా లోపలికి పంపించానేఅనుకో - అక్కడ న్యాయదేవత దర్శనం కోసం కాచుకూర్చున్న వాళ్లు ఎన్ని వేల మంది ఉంటారో ఎవరికి తెలుసు? పైగా,ఎంత మంది ఉన్నా, అంత మంది అక్కడ ఒకే గదిలో, సర్దుకుని, ఇరుక్కుని కూర్చోవాలి. ఇక్కడ తగుల్తున్నట్లు చల్లని గాలి గాని, ఇలాంటి చలువ రాతి అరుగులుగానీ, పక్షుల పాటలుగాని అక్కడ వుండవు. గాలి తగలని గదిలో ఇరుక్కుని, ఊపిరి

కూడా గట్టిగా పీల్చకుండా నిశ్శబ్దంగా కూర్చోవాలి. అలా ఆ స్థితిలో అక్కడ ఎన్ని రోజులు వేచి వుండాలో తెలీదు. అంచేత నామాటలువిని ప్రశాంతంగా హాయిగా ఇక్కడే విశ్రాంతి తీస్కో లోపల ఖాళీగా వుంది. దర్శనం వెంటనే దొరుకుతుంది అని కబుర్రాగానే నిన్ను లోపలకు పంపుతాను" అన్నాడు ద్వారపాలకుడు.

చేసేది లేక అరుగు మీద చతికిలాబడ్డాడు వ్యక్తి. రోజులు దొర్లుతున్నాయి, నెలలు గడుస్తున్నాయి. సంవత్సరాలు వెళ్లిపోతున్నాయి. కొమ్మలు పెరిగి బాగా పెద్దవై అరుగు మీద మరింత దట్టంగా నీడని ఏర్పరుస్తున్నాయి. ఆకులు లేత రంగులు, ముదురురంగులు పండినరంగులు మార్చుకుంటూ, రాలిపోతూ, కొత్తగా చిగురిస్తూ - వాటి నిత్య కృత్యంలో అవున్నాయి . పాత పక్షులు పోయి కొత్త పక్షులు ఎప్పటి కప్పుడు కొత్తకొత్తగా వినిపిస్తున్న కూజితాలు - యిలా కాలం దొర్లిపోతోంది.

వేచి కూర్చున్న వ్యక్తి వయస్సుకూడా పెరుగుతోంది. మొట్టమొదసారిగా అతను అక్కడికి వచ్చినప్పుడు ఎంతో అందమైన కొత్త దుస్తులు ధరించి వచ్చాడు. కానీ ఏళ్ల తరబడి వాటినే నిత్యం వాడుతూ వుండడం వల్ల అవి బాగా పాతబడిపోయాయి. అయినా ఆపాత బట్టల్నే కట్టుకుంటున్నాడు. తను ఒకప్పుడు చాలా అందగాడు అన్న విషయం కూడా మర్చిపోయినట్టుంది అతగాడు. ఎంతో అపురూపంగా పోషణ చేసి పెంచిన అతని అందమయిన జుట్టు జడలు కట్టి. పండిపోవడం మొదలెట్టింది.

"లోపలికి రమ్మని పిలుపొచ్చిందా?" అన్న మాట తప్ప వేరే మాట అతగాడు మాట్లాడి ఎన్నో సంవత్సరాలైంది. ఆ మాట కూడా కొన్ని రోజులకో, కొన్ని నెలలకో ఒకసారి నిమాలిత నేత్రాలతో, నిరాసక్తంగా వుచ్చరిస్తున్నాడేమో అది మాటలాగ కాకుండా ఏదో మంత్రాన్ని జపించిట్టుగా వినిపిస్తోంది. ముందు రోజుల్లోనయితే లోపలకి రమ్మని కబురొచ్చిందా అని ఎంతో ఆత్రంగా అడిగే వాడా - యిప్పుడా ఆత్రుత అస్సలు కనబడకుండా పోయింది కాలం గడుస్తుంటే, కొన్నాళ్లకి అసలు అడగడమన్నదే మానుకున్నాడు. లోపలికి రమ్మని కబురొస్తే ద్వారపాలకుడే చెప్తాడ్లే అనే నిర్లిప్త భావం వచ్చింది అతగాడిలో దాంతో అతను పూర్తిగా మాటలు మరిచిపోయిన వాడిలా అయిపోయేడు.

అతగాడికి క్రమేపి ముసలివాలకం వచ్చేసింది. జడలు కట్టిన జుట్టు, కనుబొమ్మలు అన్నీ పూర్తిగా పండిపోయేయి. బట్టలు యింకే మాత్రం ధరించడానికి వీల్లేనంతగా పీలికలై పోయాయి. అందుచేత ఆ పీలికల్ని కౌపీనంగా మార్చి ధరించేడు. మాట్లాడ్డం మానేసాడు. తన చుట్టూ వున్న అందమైన చెట్లు, కొమ్మలు, ఆకులు, మలయామారుతాలు, పక్షుల కిలాకిలా రావాలు - వీటిగురించి వచ్చిన మొదట్లో యెలా పట్టించుకోడంలేదో యిప్పుడూ అలాగే పట్టించుకోవడం లేదు అతగాడు. అతను దేని గురించేనా ఆలోచిస్తున్నాడా? ధ్యానిస్తున్నాడా? అదీ తెలియదు. అతని కళ్లల్లో మట్టుకు - "దేన్ని దర్శించీ ఏం ప్రయోజనం? మనందేన్ని దర్శించడానికి మనం చేసే ప్రయత్నం వల్ల ఏం ప్రయోజనం మనందేన్ని దర్శించలేం.మనకేదీ దర్శనమివ్వదు" లాటి

నిర్లిప్త భావాలు కనిపించేవి జాగ్రత్తగా చూసే వాళ్లకి.

ఒక నాటి సాయంత్రం సూర్యాస్తమయం కాబోతోంది. ఆ సమయంలో పశువుల్ని యిళ్లకు మళ్లించుకొస్తున్న ఒక ముసలి పశువుల కాపరి యితగాడి దగ్గరికి వచ్చి, నిల బడ్డాడు."చాలాకాలంనుంచి మిమ్మల్ని చూస్తున్నానిక్కడ, ఎవరు మీరు?" అనడిగాడు.

"ఔను, నేనెవర్ని?" సమాధానం చెప్తున్నట్లుగా కాకుండా తనని తనే ప్రశ్న వేసుకుంటున్నట్టుగా వినిపించింది సమాధానం అతి మెల్లగా, తన ప్రశ్నకు సరియైన సమాధానం రాకపోవడంతో, పశుల కాపరి "అసలు మీరెందుకున్నారిక్కడ"? అనడిగేడు.

"అవును - నేనెందుకున్నానిక్కడ?" అని మళ్లీ ఎదురు ప్రశ్నే సమాధానంగా వచ్చింది.

"పోనీ యెక్కడనుండి వచ్చాను?" "ఔను ఎక్కడ్నుండివచ్చాను?" అదీ సమాధానం "పోనీ యెక్కడికేనా వెళ్దాం అనుకుంటున్నారా యిక్కడ్నుండి?"

ఆఖరి ప్రశ్నగా అడిగేడు దీనిక్కూడా సమాధానం రాదులే అని నిశ్చయించుకొని, కాని ఈ ప్రశ్నకి సమాధానం వచ్చింది.

"అన్నట్టు మీరడుగుతే గుర్తొచ్చింది. ఆశ్చర్యం చూశారా యీ వొక్క విషయం నాకు గుర్తుంది మరే విషయం గుర్తు రావడం లేదు. నేను న్యాయదేవతని చూడ్డానికి వెళ్లాలి. అందుకనే యిక్కడ వేచి కూర్చున్నాను."

"దేని కోసం న్యాయదేవతని చూద్దామనుకుంటున్నారు?" "న్యాయం కోసం"

"ఏ విషయంలో న్యాయం కావాలి."

"ఇదమిద్దంగా చెప్పలేను. కానీ నాకు అన్యాయం జరిగిందని ఎందుకో అనిపిస్తోంది. దాని గురించే న్యాయదేవతని అడిగి తేల్చుకోవాలని."

ఇంతలో అక్కడికి ద్వారపాలకుడు వచ్చేడు నవ్వుతూ. వస్తూనే " అమ్మయ్య ఎట్టకేలకి శుభవార్తయ్యి కొద్దిరోజుల్లో నువ్వు న్యాయదేవత దర్శనానికి వెళ్లడానికి అనుమతి రాబోతోందని యిప్పుడే తెలిసింది." ఆ వార్త చెప్పేసి ద్వార పాలకుడు వెళ్లిపోయాడు. ఏకాంతంలో మిగిలేడు వ్యక్తి, చాలా ఏళ్ళ తర్వాత మళ్లీ యివాళే ఆలోచన ప్రారంభించాడు. న్యాయదేవత సమక్షంలోకి వెళ్లగానే తనేం చెప్పాలి? తనకి న్యాయం కావాలని.

"నీకు జరిగిన అన్యాయం ఏమిటి?" అని ప్రశ్న వేస్తుంది న్యాయదేవత.

"ప్రపంచంలోకి నన్ను తీస్కొచ్చి తీరని అన్యాయం చెయ్యలేదా?" అనడుగుతాడు తను.

"ఏమిటీ - యింతమంది జనాభాలో ఏ ఒక్కడూ - యీ ప్రపంచంలోకి రావడం అన్నది తనకి జరిగిన అన్యాయం - అని యింత వరకు అనలేదే! నీకొక్కడికేనా యీ రకంగా అన్యాయం జరిగిందని తెలిసొచ్చింది?" అని కళ్లెర్ర చేసి గద్దిస్తుంది.

"కాదుతల్లీ! నా కొక్కడికే కాదు యీ అన్యాయం జరిగింది. మానవులందరూ యీ బతుకనే

అర్థం లేని రొంపిలో కూరుకుపోయి, దిక్కుతోచకుండా బతుక్కొస్తున్నారు. రొంపిలో ఎంత లోతుకి కూరుకుపోయారంటే, తమకి అన్యాయం జరిగిందనే స్పృహే లేదు కోటానుకోట్లమందికి' ' అనివినయంగా మనవి చేసుకుంటాను.

"ఎక్కడో, ఏదో అన్యాయం జరిగిందనే జ్ఞానం నీకొక్కడికే కలిగిందన్న మాట. సరే వెళ్లు- నీ ఫిర్యాదు గురించి ఆలోచిస్తాను" అని నిష్టూరంగా మాట్లాడి పంపేస్తుంది నాయ్య దేవత. అప్పుడు తనేం చెయ్యాలి? మనుషులకి అన్యాయం జరిగిందని న్యాయదేవతే అంగీకరించడానికి సిద్ధంగా లేకపోతే, తను యింకెవరికి ఫిర్యాదు చేస్కోవాలి?

ఇలా సాగింది అతని ఆలోచనా ప్రవంతి, ఆలోచనల్లో మునిగిపోయి కాలగమనాన్ని కూడా మరిచి పోయేడతగాడు. ఏళ్లు గడిచిపోతున్నాయి.ఇప్పుతడతనికి చూపు బాగా తగ్గిపోయింది. ఎవర్నీ పోల్చుకోలేడు. అనేక సంవత్సరాలుగా ఆలోచనల్లో పడిపోయి ఎవరితో నీఒక్కమాట కూడా మాట్లాడక పోవడం వల్ల కాబోలు, అతన్నిప్పుడు ఎవరేది అడిగినా బోధపర్చుకునే శక్తిపోయింది. అరుగు మీద అటూ యిటూ నిత్యం పచార్లు చేస్తుంటాడు. కాని, దేని కోసం యిలా పచార్లు చేస్తున్నాననే స్పృహ కూడా పోయింది. కళ్లు సరిగ్గా కనపడక పోవడం వల్ల కాబోలు - రుతువులు, వాటి మార్పులు, యివేవి అతన్ని స్పందింపచెయ్యడం మానేశాయి. ఎంతకాలం గానో ఒంటి మీద బట్టలేకపోవడం వల్ల వాతావరణ మార్పులకి శరీరం అలవాటయి పోయినట్టుంది, యిప్పుడతనికి - చలి, గాలి, వేడి, వాన - యివేవీ కూడా తెలియకుండా పోయాయి.

ఉన్నట్టుండి న్యాయదేవత దగ్గర్నుంచి అతన్నిరమ్మని పిలుపొచ్చింది. ద్వారపాలకుడు అరుగుదగ్గరకు పరుగెత్తి "న్యాయదేవత నిన్ను పిలుస్తోంది - త్వరగా లోపలికి వెళ్లు" అని చెప్పేడు. కాని అతని మాటల్ని ముసలాడు పట్టించుకోలేదు. అతనికా మాటలు బహుశా వినిపించి వుండకపోవచ్చును. వినిపించినా వాటి అర్థం బోధపడక పోయుండవచ్చును. అయితే ద్వారపాలకుడు నాకెందుకులే అని వూరుకొని కూర్చోడానికి లేదు కదా! న్యాయదేవత ఆజ్ఞ అమలు జరిగేట్టు చూసి తీరవలసిందే అతగాడు! అందుచేత, ద్వార పాలకుడు అదే పనిగా "న్యాయదేవత పిలుస్తోంది లోపలికి వెళ్లు న్యాయదేవత పిలుస్తోంది లోపలికి వెళ్లు" అని ముసలాడి చెవి ముందు యిల్లుకట్టుకొని అరవడం మొదలెట్టేడు. అలా కొన్నేళ్లపాటు అతగాడు అరుస్తూనే వున్నాడు. చివరికి చెవి దగ్గర యిల్లు కట్టుకొని అరచిన దానికి ఫలితం కనిపించింది. ఒకనాడు ముసలాడికి అతని అరుపు అర్థమయినట్టుంది. దాంతో అకస్మాత్తుగా అతని మాట్లాడే శక్తి కూడా పునరుద్ధరించబడింది. తను చేస్తున్న పచార్లు ఆపి, ఎంతో అనాసక్తంగా, " ఏమిటీ - న్యాయదేవత దగ్గర్నుండి పిలుపొచ్చిందా? నేను లోనికి వెళ్లాలా? సరే వెళ్తున్నాను" అని మెల్లగా అరుగు దిగి, ప్రశాంతంగా, గంభీరంగా, మహాయోగిలా నడుస్తూ, ద్వారం దగ్గరకి చేరుకున్నాడు. ద్వార పాలకుడు అతనికి చెతులెత్తి నమస్కారం చేశాడు.

ఎన్నో వ్యయప్రయాసల కోర్చి, తను చేరవలసిన గమ్యం చేరుకున్నంత సంబర పడిపోతూద్వారానికి మోకరిల్లేడు ముసలాడు. ఆ స్థితి నుండి మరతను లేవలేదు.

**ఈ కథకు ప్రేరణ FRANZ KAFKA**
**చిన్న కథ "BEFORE THE LAW"**

(ఆహ్వానం, ఏప్రియల్ 1996)